అంశం: 12

# చెత్తను సేకరించే వారి దుస్థితి

**లక్ష్యం:**

చెత్త సేకరించే వారి ఆరోగ్యం పట్ల అవగాహనను కలిగి ఉండడం.



**నేపథ్యం:**

గ్రామీణ, పట్టణ ప్రాంత పర్యావరణ సమస్యలలో ముఖ్యమైనది. చెత్తను విచక్షణారహితంగా వేయడం. ఇండ్లు, పాఠశాలలు, అంగళ్ళలో తయారైన వ్యర్థ పదార్థాలు లేదా చెత్తను కుండీల ద్వారా సేకరించి పురపాలక సంఘాలు సంబంధిత చెత్త నిలువ చేసే ప్రదేశాలలోకి చేరుస్తాయి. చెత్త నిలువ చేసే ప్రదేశాలు చెత్తతో పూర్తిగా నిండిపోయి ఈగలు, దోమలు, బొద్దింకలు బాగా పెరిగి వ్యాధులను వ్యాప్తి చేస్తుంటాయి. చెత్తను సేకరించే వారు చెత్తకుండీల దగ్గర సేకరిస్తున్న సమయంలో రకరకాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. తరచుగా వారు విరిగిపోయిన గాజుపెంకులు లేక విస్ఫోటక పదార్థాల వల్ల గాయాలబారిన పడుతూ ఉంటారు.



**పద్ధతి:**

1. రహదారుల పక్కన చెత్తను సేకరించేవారిని ఇంటర్వ్యూ చేయండి.
2. కింది అంశాలపై సర్వే నిర్వహించి కింది విషయాలను తెలుసుకోండి.
   ఎ) పేరు, వయస్సు
   బి) ప్రతి రోజు ఎంత దూరం తిరిగి చెత్త సేకరిస్తారు.
   సి) రోజులో చెత్త సేకరించడానికి ఎంత సమయం వెచ్చిస్తారు.
   డి) ఎన్ని రకాల చెత్తను సేకరిస్తారు?
   ఇ) చెత్తను సేకరించే సమయంలో చేతులకు

గ్లౌజులు, కాళ్ళకు సాక్స్‌లు వేసుకోవటం, మాస్క్‌లు పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటారా?

ఎఫ్) చెత్త సేకరించే సమయంలో ఎదుర్కొనే సమస్యలు ఏమిటి?

జి) సేకరించిన చెత్తను ఏం చేస్తారు?

హెచ్) ఏదైనా సమస్యలు / అనారోగ్యాలతో ఇబ్బంది పడుతున్నారా?

ఐ) అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యుడి దగ్గరకి వెళతారా? వెళ్ళకపోతే కారణాలు తెలుసుకోండి?

**ముగింపు:**

చెత్త పేరుకు పోకుండా మన పరిసరాలను చెత్త సేకరించేవారు నిత్యం శుభ్రం చేస్తూ ఉంటారు కదా! వారు కొంతకాలం చెత్త శుభ్రం చేయకపోతే ఏమవుతుందో ఆలోచించండి. సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేసేవారు, చెత్తను సేకరించేవారు తమ ఆరోగ్యాలను ఫణంగా పెట్టి మనకు సేవ చేస్తారు. వీరికి మనవంతు సాయం చేయడం మన కర్తవ్యం. వారికి అవసరమైన సాక్సులు, గ్లౌజులు అందించడంతోబాటు వారు సేకరించే విధంగా అంటే తడి, పొడి, రీసైకిల్ చేయడానికి వీలైనవి, ఇతరాలుగా విభజించి ఉంచితే చెత్తను సేకరించే వారికి అనువుగా ఉంటుంది.

మీ అధ్యయనం ఆధారంగా చెత్తను సేకరించే వారు ఏ ఏ వ్యర్థాలను సేకరిస్తున్నారు, వారి ఆరోగ్యపరిస్థితిపై ఒక నివేదిక రూపొందించండి.

**తదుపరి చర్యలు:**

1. స్థానిక అంగళ్ళలో సరైన విధంగా చెత్తను తొలగించేలా చర్యలు మొదలుపెట్టడానికి సూచనలు చేయండి.
2. చెత్త సేకరించే వారికి మీరు వాడని బూట్లు, సాక్స్‌లు, మాస్క్‌లు మొదలైనవి అందజేసి సహాయం చేయండి.
3. చెత్త సేకరించే వారు సమాజానికి చేస్తున్న సేవను మీరు ఏలా గౌరవిస్తారు.? వారిపట్ల మీ భావాలను వ్యక్తం చేయడానికి ఏఏ పనులు చేస్తారు.
4. అన్ని వృత్తులు, పనులు ప్రధానమైనవే విలువైనవే అని మీరు అంగీకరిస్తారా? ఎందుకు?

*వాహనాలలో వాడేసిన వ్యర్థాలు, గోళ్ళ రంగులను పోగొట్టే రసాయనాల వంటి సౌందర్య ఉత్పత్తులు ఉద్యాన వనాలలో వాడే రసాయనాలు, ట్యూబ్‌లైట్‌లు ఇతర ప్రమాదకరమైన వ్యర్థాలను సేకరించేటపుడు చెత్త సేకరించే వారు తీవ్రమైన అనారోగ్యానికి గురవుతారు.*

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2021-22